అక్రమ వెంచర్‌లో హైడ్రా కూల్చివేతలు


వెంచర్‌లో రోడ్లను ధ్వంసం చేస్తున్న హైడ్రా సిబ్బంది

సరూర్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో ఓ ప్రైవేటు వెంచర్‌ను రీ వెంచర్ చేసి అక్రమంగా రోడ్లు నిర్మించి తప్పుడు డాక్యుమెంట్లతో ఇళ్ల నిర్మాణాలకు సిద్ధమవుతున్నట్టుగా ఒరిజినల్ ప్లాట్ ఓనర్ల నుంచి అందిన ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు బుధవారం అక్కడకు వెళ్లి సదరు వెంచర్‌లోని రోడ్లు, ప్లాటింగ్ రాళ్ల తొలగించారు. నాదర్‌గుల్‌లోని సర్వే నంబర్.90లోని సుమారు మూడెకరాల భూమిని 40 ఏళ్ల క్రితం సింగిరెడ్డి సత్తిరెడ్డి అనే వ్యక్తి నుంచి టెలికామ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే ఉద్యోగులు కొనుగోలు చేసి టెలికాం కోఆపరేటివ్ సొసైటీ పేరుతో వెంచర్ చేసుకున్నారు. కాగా ఇటీవల సదరు భూమిలోని ఒక ఎకరాను సత్తిరెడ్డి తప్పుడు డాక్యుమెంట్లతో ఆక్రమించి, పాత లేఅవుట్‌ను మార్చి కొత్తగా ప్లాంటింగ్ రాళ్ల పాతి రోడ్లు నిర్మించారు. దీనిపై బాధితులైన సొసైటీ సభ్యులు హైడ్రాకు, జిల్లా కలెక్టర్‌కు, సీడీఎంఏకు ఫిర్యాదులు చేయగా, పత్రాలన్నీ పరిశీలించిన హైడ్రా అధికారులు ఆక్రమణ నిజమేనని నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో బుధవారం తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని రోడ్లను, ప్లాటింగ్ రాళ్లను తొలగించి మొత్తం భూమిని టెలికాం సొసైటీ సభ్యులకు హ్యాండోవర్ చేశారు. కాగా సదరు వెంచర్‌లో 23 ప్లాట్లకు బడంగ్‌పేట్ కార్పొరేషన్ నుంచి తప్పుడు పర్మిషన్లు తీసుకున్నట్లు తెలియడంతో సదరు పర్మిషన్లను రద్దు చేసినట్టు టీపీవో కిరణ్‌కుమార్ తెలిపారు. తమ ప్లాట్లను తమకు తిరిగి అప్పగించిన హైడ్రా అధికారులకు సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చెస్తా: కార్పొరేటర్


ప్రశాంత్‌నగర్‌లో పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

వనస్థలిపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చెస్తానని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం ముందు సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు.

వరదనీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తాం


సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వరదనీటి సమస్యలను శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరద ముంపుకు గురైన కాలనీల్లో కార్పొరేటర్ బుధవారం పర్యటించారు. కాలనీవాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీఈ దామోదర్‌రావు, జలమండలి డీజీఎం రాజ్‌గోపాల్, మేనేజర్ భవ్య, హైడ్రా మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- టీటీఐ ఆర్ఎస్ఐ సంతోష్ కుమార్, ఎస్ఐ నర్సింహారావు
- అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న 384 మంది విద్యార్థులు, వాహనదారులు


ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొత్తపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వాహన ప్రయాణంలో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, వాటి ప్రాముఖ్యతను గుర్తించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఆర్ఎస్ఐ సంతోష్ కుమార్, ఎస్ఐ నర్సింహారావు, ఏఎస్ఐ సోమ్‌నాథ్ అన్నారు. బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు టీటీఐలో మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలపై 13 అవగాహన కార్యక్రమాల్లో 384 మంది విద్యార్థులకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించామన్నారు. పోచంపల్లి దేశ్‌ముఖి జడ్‌పీహెచ్ఎస్, పెద్ద అంబర్‌పేట్, కొత్తగూడెం, లక్ష్మారెడ్డి పాలెం, భాగ్యలత వనస్థలిపురం రోడ్ తదితర ప్రాంతాల్లో 5 ప్రైవేటు పాఠశాలల్లో, కూడళ్లలో నిర్వహించామన్నారు. పాఠశాలల్లో ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్‌తో ప్రమాదాల వీడియోలను ప్రదర్శించామన్నారు. నిబంధనలు పాటిస్తే ప్రమాదాల తీవ్రతనూ తగ్గించే వీలుందని వివరించామన్నారు. బైకులు నడిపే వారు హెల్మెట్, కార్లు నడిపే వారు, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని వివరించామన్నారు. విద్యార్థులకు, వాహనదారులకు కరపత్రాలను తెలుగు, ఇంగ్లిషు భాషల్లో రూపొందించిన ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ ఫర్‌చిల్డ్రన్ బుక్‌లెట్స్ పంపిణీచేశామన్నారు.

32 మంది మద్యంప్రియులకు కౌన్సెలింగ్

మద్యం మత్తులో వాహనాలు నడపకుండా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని టీటీఐ ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య వివరించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 32 మంది మద్యం ప్రియులకు 32 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం టీటీఐ లెక్చర్‌హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం అనర్థాలపై అవగాహన కల్పించడంలో భాగంగా సిబ్బంది రమేష్ సందేశాత్మక గీతాలు, మద్యంమత్తులో వాహనాలు నడపడంతో జరిగిన పలు ప్రమాదాల వీడియో క్లిప్పులను, ప్రముఖుల సందేశాలను ప్రదర్శించారు.

చిన్నారుల ఎదుగుదలకు కృషి చేయాలి


ఆర్కస్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆధునిక విధానాలను అనుసరిస్తూ చిన్నారుల ఎదుగుదల, విద్యావిజ్ఞానం పెంపొందేందుకు తోడ్పాటునందించాలని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆర్కస్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకులకు సూచించారు. డివిజన్ పరిధి విఠల్ ఎన్‌క్లేవ్‌కాలనీ సహారా ప్రధానరోడ్డు మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్కస్ చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ అండ్ ఎర్లీ థాట్స్ ప్రీ స్కూల్‌ను నిర్వాహకురాలు డాక్టర్ నిఖితారెడ్డితో కలిసి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిలు విచ్చేసి బుధవారం వేర్వేరుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్కస్ నిర్వాహకులు కతీక్ రాజారెడ్డి, సీఈఓ గోగుల రణధీర్‌రెడ్డి, సీఓఓ వాణి సులోచన, బీజేపీ నాయకుడు పాతూరి శ్రీధర్‌గౌడ్, కాలనీఅధ్యక్షుడు రవికుమార్, గాలయ్య, బాలయ్య పాల్గొన్నారు.


ఉప్పల శ్రీనివాస్‌గుప్తా చేతులమీదుగా నియామక పత్రాలను అందుకుంటున్న ఐవీఎఫ్ మహిళావిభాగం కమిటీ సభ్యులు

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళలు వ్యాపార, ఉద్యోగ రంగాలతో పాటు రాజకీయ రంగాల్లోనూ రాణించాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి, అంతర్జాతీయ వైశ్యఫెడరేషన్(ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని తన క్యాంపు కార్యాలయంలో ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మిల ఆధ్వర్యంలో ఐవీఎఫ్ మహిళా విభాగం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఐవీఎఫ్ మహిళా విభాగం రాష్ట్ర పొలిటికల్ చైర్‌పర్సన్‌గా గీతాగుప్తా, సలహాదారులుగా ఏపూరి జయలక్ష్మి, భువన, ఈసీ సభ్యులుగా మంజుల, సౌమ్య, రంగ సంతోషరాణి, రేణుక, శైలజ, సాధన, సునీత, వాణి, జ్యోతి, నీలిమ, రాణిగుప్తా, ఐవీఎఫ్ మహిళా విభాగం నాగోల్ డివిజన్ అధ్యక్షురాలిగా జయశ్రీ, ప్రధానకార్యదర్శిగా నీల జ్యోతిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ మహిళా విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మంజుల, కోశాధికారి నళిని, సలహాదారు మణిమాల తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ రీజినల్ స్థాయి లక్కీడ్రా


లక్కీడ్రా విజేతలను ప్రకటిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత, సుల్తాన్‌బజార్ ఏసీపీ మట్టయ్య తదితరులు

చాదర్‌ఘాట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ నడిపిన ప్రత్యేకబస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికుల టికెట్ల లక్కీ డ్రా కార్యక్రమం మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి ముఖ్యఅతిథిగా విచ్చేసి లక్కీ డ్రా తీయగా నిజామాబాద్‌కు చెందిన సమియా బస్సు ప్రథమ బహుమతిని సాధించినట్లు ప్రకటించారు. గత నెల సెప్టెంబరు 30వ తేదీన నిజామాబాద్ నుంచి జేబీఎస్ వరకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించిన సమియా తబస్సు ప్రథమబహుమతిగా రూ.25వేల నగదు సాధించినట్లుగా రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత వివరించారు. లక్కీ డ్రాలో ద్వితీయ బహుమతిగా జె.శారద రూ.15వేల నగదు సాధించినట్లుగా ప్రకటించారు. సూర్యాపేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు డీలక్స్ బస్సులో శారద ప్రయాణించినట్లు వివరించారు. డ్రాలో తృతీయ బహుమతిగా అజర్ రూ.10వేల నగదు సాధించినట్లు ప్రకటించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే దసరా పండుగ సందర్భంగా నిర్వహించే లక్కీ డ్రాలో ఈసారి కూడా రంగారెడ్డి రీజియన్ నుంచి రూ.50వేల నగదు బహుమతులను అందజేస్తున్నట్లు రీజినల్ మేనేజర్ శ్రీలత తెలిపారు. దసరా పండుగ సందర్భంగా రీజియన్ నుంచి నడిపిన రెగ్యులర్ బస్సులతోపాటు ప్రత్యేకబస్సుల ద్వారా రూ.24కోట్ల మేరకు ఆదాయం లభించిందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ ఏసీపీ మట్టయ్య, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవి, రంగారెడ్డి రీజియన్ డిప్యూటీ ఆర్ఎం సరస్వతితో పాటు పలువురు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే రోగాలు దూరం

మన్సూరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇళ్లతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు దరిచేరవని జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.వంశీకృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్‌లు పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని కోఆపరేటివ్‌బ్యాంక్‌కాలనీలో బుధవారం జీహెచ్ఎంసీఆధ్వర్యంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీసీ వంశీకృష్ణ, చింతల సురేంద్రనాథ్‌యాదవ్‌లు విచ్చేసి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ నీలిమ, జవాన్ దర్శన్, రమేష్, సాయి, కాలనీవాసులు సంజీవరెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు

అబ్దుల్లాపూర్‌మెట్: వ్యవసాయ యంత్రాలు, పనిముట్లపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అబ్దుల్లాపూర్‌మెట్ మండల వ్యవసాయ అధికారి ఐ.పల్లవి కోరారు. పూర్తి వివరాల కోసం మండల కేంద్రంలోని రైతు వేదికలో విస్తరణ అధికారిని సంప్రదించాలన్నారు. వివరాల కోసం ఫోన్ నంబర్లు 8977753709, 6305920181లలో సంప్రదించాలని సూచించారు.

రైతుల చెంతకు సాంకేతికతను చేర్చాలి

హయత్‌నగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సమయానుసారంగా రైతులకు సాంకేతికసమాచారాన్ని చేరవేయాల్సిన బాధత వ్యవసాయ అధికారులపైన ఉందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉషా అన్నారు. బుధవారం హయత్‌నగర్‌లోని కేంద్రీయమెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థలోని రంగారెడ్డి జిల్లా కృషి విజ్ఞానకేంద్రంలో అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ బయోసైన్స్ ఇంటర్ నేషనల్ సహకారంతో ఆధునిక డిజిటల్ వ్యవసాయ విధానం-చీడపీడల వ్యవసాయంపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉష హాజరై ప్రసంగించారు. సెంటర్ ఫర్ అగ్రికల్చర్ బయోసైన్స్ ఇంటర్‌నేషనల్ అకాడమీ కోఆర్డినేటర్ చంద్రకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైంటిస్టులు మధుమంజరి, అనిషా, డీడీఏ చంద్రశేఖర్, పలువురు రైతులు పాల్గొన్నారు.